క్లుప్తంగా

ఎదుర్లంకలో సినీ సందడి



ఎదుర్లంకలో సినిమాకు క్లాప్ కొడుతున్న జెడ్పీటీసీ, ఎంపీపీ తదితరులు

ఐ.పోలవరం: ఎదుర్లంక రాధమ్మరేవు వద్ద బుధవారం సినీ సందడి నెలకొంది. ఎల్‌సీపీ ప్రొడక్షన్ బ్యానర్‌పై 4రోజెస్ సినిమాను జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, ఎంపీపీ రాణి మిరియం జ్యోతి, పార్టీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మాత చిట్టిపల్లి వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ రఘురామ్‌రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నారప్ప ఫేమ్ రాఖీ, ప్రశాంత్, అనుశ్రీ, ఢీ జోడి అక్షాఖాన్ నటిస్తున్నారన్నారు. దీనికి సంగీతం వెంకటేష్ బోల్లా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పరిసర ప్రాంతాల్లో వారం రోజుల పాటు షూటింగ్ జరుగుతుందన్నారు.

ఘనంగా రుద్ర హోమం



మురమళ్లలో రుద్ర హోమం చేస్తున్న అర్చకులు

ఐ.పోలవరం: మురమళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో పరమశివుని జన్మ నక్షత్రమైన ఆరుద్రను పురస్కరించుకుని బుధవారం రుద్ర హోమం నిర్వహించారు. ఆలయ అర్చకస్వామి పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో పలువురు పండితులు స్వామివారికి రుద్రార్చన, రుద్రహోమం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయంలో నిత్యాన్నదానానికి సికింద్రాబాద్‌కు చెందిన అనిపిండి రాంబాబు దంపతులు రూ.11,116 సమర్పించారు. ఆ సొమ్మును ఆలయ స్వస్తివాచకులు నాగాభట్ల రవిప్రసాద్‌కు ఇచ్చారు. దాతకు స్వామి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

ముమ్మిడివరం: రారాజు జిమ్ అండ్ కరాటే, స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 26న టీటీఆర్ కల్యాణ మండపంలో కరాటే పోటీలు నిర్వహించారు. ఇందులో స్థానిక మరియా మాంటిస్సోరీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. విజేతలకు బుధవారం సర్టిఫికెట్లు, మెమొంటోలను కరాటే మాస్టార్ రారాజు అందించారు. పాఠశాల కరస్పాండెంట్ వి.రవి, హెచ్ఎం అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి రిఫ్రిజిరేటర్ బహూకరణ



వెంకన్న ఆలయం వద్ద రిఫ్రిజిరేటర్‌తో విరీతాదేవి, ట్రస్ట్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు దాతల సహకారం తోడవుతోంది. బుధవారం మహిపాల వీధి అబ్బిరెడ్డి రామదాసు ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 60 లీటర్ల సామర్థ్యం కలిగిన కూలింగ్ రిఫ్రిజిరేటర్‌ను ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవికి అందజేశారు. ఈ రిఫ్రిజిరేటర్‌ను ఆ ట్రస్ట్ ప్రతినిధి అబ్బిరెడ్డి సురేష్, పట్టణ వైఎస్సార్ సీపీ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి సమకూర్చారు. ఆలయ ఈఓ దూనబోయిన సాయిబాబు, స్థానిక ప్రతినిధులు అబ్బిరెడ్డి మూర్తి, తనీష్, జంగా బాబీ పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తా చాటాలి

యానాం: గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటాలని ప్రధానోపాధ్యాయురాలు చింతా పద్మశ్రీ అన్నారు. బుధవారం దరియాలతిప్ప డాక్టర్ కేఆర్ నారాయణన్ ప్రభుత్వ హైస్కూల్‌లో పుదుచ్చేరి విద్యాశాఖ ఆధ్వర్యంలో వార్షిక స్పోర్ట్స్ డే నిర్వహించారు. రిటైర్డ్ పీఈటీ చింతా రామకృష్ణ మాట్లాడుతూ క్రీడా సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలోయర్రా జగన్నాథం (జగ్గు), గ్రామ పెద్ద సబ్బతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధ మతాన్ని విస్తరించాలి

అమలాపురం టౌన్: మహా సామ్రాట్ అశోకుని జయంతి స్థానిక గడియారం స్తంభం సెంటర్‌లో బౌద్ధులు, అంబేడ్కరీయుల ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. అశోకుని భారతీయ, బౌద్ధ మూలాలను బౌద్ధ జాతీయ కార్యదర్శి ఎస్ఎస్ఆర్ భూపతి వివరించారు. బౌద్ధాన్ని భారత దేశమంతా విస్తరింపజేయాలని ఆయన పిలుపునిచ్చారు. బౌద్ధ మతం దేశంలో రెండు వేల ఏళ్ల పాటు ఒక జ్వలిత జ్వలలా వెలుగు ఇచ్చిందని రాష్ట్ర బౌద్ధ ఉపాధ్యక్షుడు మట్టా వెంకటరావు అన్నారు. బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా (బీఎస్ఐ) జిల్లా శాఖ అధ్యక్షుడు మట్టా సిద్ధార్థ గౌతమ్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఈవీవీ సత్యనారాయణ, జిల్లా కోశాధికారి ఎస్.పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలు నింపి.. కష్టాలు సాగనంపి

- సాగునీటి పంపిణీకి పక్కా చర్యలు
- క్రాస్‌బండ్లతో నీటి ఎద్దడి నివారణ
- సత్ఫలితాలిస్తున్న ప్రభుత్వ చర్యలు



బొండాయికోడు వద్ద మోటార్లతో నీటిని పంట కాలువలోకి తోడుతూ..

ముమ్మిడివరం: చక్కని ప్రణాళిక ఉంటే అసాధ్యాన్ని సుసాధ్యం చేయవచ్చు.. వృథా జలాలను అందిపుచ్చుకోవచ్చు.. సాగునీటి ఎద్దడిని నివారించవచ్చు.. సరిగ్గా అలాంటి ప్రణాళికతో ప్రభుత్వం పంట పొలాలకు నీరందిస్తోంది.. ప్రతి ఎకరాకూ ఇబ్బంది లేకుండా చూస్తోంది.. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో సుమారు 58 వేల ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. ప్రస్తుతం పంట చివరి దశకు చేరుకుంది. ముమ్మిడివరం మండలం బొండాయికోడు, అయినాపురం, సోమిదేవరపాలెం, ఐ.పోలవరం మండలం గుత్తెనదీవి, ఎదుర్లంక, కొమరగిరి, అమలాపురం రూరల్ భట్నవిల్లి, కాట్రేనికోన మండలం పల్లంకుర్రు, నడవపల్లి తదితర గ్రామాల్లోని పలు ప్రాంతాల్లో సాగునీటి ఎద్దడి నెలకొంది. దీనిని ముందుగానే గుర్తించిన ప్రభుత్వం అధికారులకు తగిన సూచనలు చేసింది. ఇందులో భాగంగా ఆయా ప్రాంతాల్లో మురుగునీటి కాలువల్లో నుంచి పంట కాలువలోకి నీటిని మోటార్ల ద్వారా పంపింగ్ చేసి తద్వారా శివారు భూములకు నీరందిస్తున్నారు. అలాగే పలుచోట్ల మురుగు కాలువల నుంచి సముద్రంలోకి పోతున్న వృథా జలాలను చేలకు మళ్లిస్తున్నారు. రబీ ముగింపు దశకు చేరుకోవడంతో పూర్తి స్థాయిలో నీరందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆయకట్టులో ప్రతి ఎకరాకూ సాగు నీరందించే కృత నిశ్చయంతో ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది.

మిగిలిన 20 రోజులే కీలకం

ప్రస్తుతం వరి ఈనిక దశకు చేరుకుంది. మరో 20 రోజుల్లో పంట కోతకు వస్తుంది. ఈ రోజులనే కీలకంగా చేసుకుని నీరు అందిస్తున్నారు. ఈ సమయంలో ఎక్కడా ఇబ్బంది రాకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే దశల వారీ విధానం, మురుగునీటి కాలువలకు క్రాస్ బండ్‌ల నిర్మాణం వంటివి చేపట్టి అధికారులు సత్ఫలితాలు సాధించారు. దీనికితోడు మురుగునీటి కాలువలలో వృథా నీటిని సద్వినియోగం చేసుకునేందుకు ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి సరికొత్త ఒరవడిని తీసుకువచ్చింది. తద్వారా నియోజకవర్గంలో బొండాయికోడు, గుత్తెనదీవి తదితర ప్రాంతాలలో మురుగునీటి కాలువలలో ఉన్న వృథా నీటిని మోటార్ల ద్వారా పంట కాలువల్లోకి పంపింగ్ చేస్తున్నారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలలో 5 హెచ్‌పీ మోటార్లు ఏర్పాటు చేసి వృథా నీటిని కాలువల్లోకి మళ్లిస్తున్నామని ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్ తెలిపారు. దీని వల్ల అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో సుమారు 10 వేల ఎకరాలకు సాగునీటి ఎద్దడి లేకుండా చేయగలిగామని వివరించారు.



కళకళలాడుతున్న వరి చేలు

ఇబ్బంది లేకుండా సాగు



ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రాస్ బండ్‌ల వల్ల పంటలకు ఎంతో మేలు జరిగింది. గతంలో రెండు రోజులకోసారి నీరు పెట్టాల్సి వచ్చేది. ఇప్పుడైతే వారం రోజులకు గానీ నీరు పెట్టనవసరం లేదు. తద్వారా ఇబ్బంది లేకుండా సాగు చేస్తున్నాం.

–కొమ్మిరెడ్డి శ్రీనివాసరావు, రైతు, గాడిలంక

కష్టాలు గట్టెక్కాయి



రబీ ప్రారంభంలో సాగునీటికి కొన్ని ఒడిదొడుకులు ఎదుర్కొన్నాం. ప్రభుత్వం చేపట్టిన వంతుల వారీ విధానం, లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ఉపయోగపడ్డాయి. మరో రెండుసార్లు తడి పెడితే దాళ్వా సాగు గట్టెక్కుతుంది.

–ఏఎస్‌వీ సుబ్బారావు, రైతు, అయినాపురం

బాధితులకు సాయం



బాధితులకు సాయం అందిస్తున్న దేవాంగ సంక్షేమ సంఘం నాయకులు

అమలాపురం రూరల్: బండారులంక పేరివారిపేటలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన ఎనిమిది కుటుంబాలకు పాలకొల్లు పట్టణ దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వట్టం గణేష్ మిత్ర బృందం ఆధ్వర్యంలో సాయం చేశారు. బాధిత కుటుంబానికి రూ.ఐదు వేలు, దుస్తులు, నిత్యావసరాల చొప్పున బుధవారం పంపిణీ చేశారు. కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ వూటుకూరి సుబ్రహ్మణ్యస్వామి ఈ సాయాన్ని పంపిణీ చేశారు. చేనేత సంఘ నాయకులు పుత్సల వరదరాజు, చింతా శంకర మూర్తి, బళ్ల వెంకటేశ్వరరావు, చింతా శ్యామ్, మాదా రాము పాల్గొన్నారు.

పెట్టుబడి ప్రోత్సాహకం అందజేత

యానాం: స్థానిక మార్కెట్ కాంప్లెక్స్‌లో వ్యవసాయ శాఖ, రైతు సంక్షేమం ఆత్మ పథకంలో భాగంగా బుధవారం రైతు శిక్షణ జరిగింది. వరిలో సమగ్ర పోషక యాజమాన్యం తదితర అంశాలపై రైతులకు అధికారులు వివరించారు. ప్రభుత్వం మంజూరు చేసిన పెట్టుబడి ప్రోత్సాహకం రూ.12.20 లక్షల చెక్కును రైతులకు ఆర్ఏఓ మునిస్వామి అందజేశారు. వ్యవసాయశాఖ డీడీ ఆర్.గణేషన్, వ్యవసాయ అధికారి చిక్కాల జోగిరాజు పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ విజయ్‌థామస్

అల్లవరం: ప్రభుత్వ పథకాలను వలంటీర్ల ద్వారా పారదర్శకంగా వర్తింపజేయాలని డీఎల్‌డీఓ విజయ్‌థామస్ అన్నారు. ఎంపీడీఓ జి.సరోవరరావు ఆధ్వర్యంలో కొమరగిరిపట్నం క్లస్టర్ పరిధిలోని ఐదు సచివాలయాల వలంటీర్లకు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు మాట్లాడుతూ లబ్ధిదారులకు నేరుగా పథకాలను అందించేందుకు వలంటీర్ వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చారన్నారు. ఎంపీడీఓ సరోవరరావు మాట్లాడుతూ ప్రతి వలంటీర్ వారానికి మూడు రోజులు కచ్చితంగా బయోమెట్రిక్ ద్వారా హాజరు వేయాలన్నారు. సర్పంచులు రాకాపు విజయలక్ష్మి, బర్రే సీతారత్నం, కొల్లు వెంకటరమణ, ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు ఘన స్వాగతం



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు స్వాగతం పలుకుతున్న పార్టీ అల్లవరం మండల శ్రేణులు

అల్లవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్సీగా ఎన్నికై తొలిసారిగా జిల్లాకు వచ్చిన బొమ్మి ఇజ్రాయిల్‌కు వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం ఘన స్వాగతం పలికారు. మండలంలోని పలు గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముఖద్వారం రావులపాలెం చేరుకున్నారు. అక్కడ ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఉంద్రు వెంకటేశ్వరావు, బీసీ సెల్ అధ్యక్షుడు యల్లమిల్లి బోసు, నాయకులు అడపా శ్రీను, పెచ్చెట్టి వెంకటేశ్వరావు తదితరుల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు పూలమాలలు వేసి స్వాగతం పలికారు. అనంతరం ప్రారంభమైన విజయయాత్ర స్వగ్రామం గోడి వరకు సాగింది. ఎమ్మెల్సీ వెంట బాపట్ల ఎంపీ నందిగం సురేష్, మంత్రి విశ్వరూప్ తనయుడు పినిపే శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాగాలి



వేడుకలను ప్రారంభిస్తున్న ఏఎస్పీ లతామాధురి, చైర్మన్ శేషారెడ్డి

అమలాపురం టౌన్: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని జిల్లా ఏఎస్పీ కె.లతామాధురి అన్నారు. బుధవారం స్థానిక గొల్లగూడెంలోని ఆదిత్య స్కూల్‌లో వార్షికోత్సవానికి ఆమె హాజరై ప్రసంగించారు. స్కూల్ ప్రిన్సిపాల్ కుంపట్ల లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగిన ఈ సంబరాలకు డీఈఓ ఎం.కమలకుమారి, ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టర్ శృతిరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ పి.చలపతిరావు అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. డీఈఓ కమలకుమారి మాట్లాడుతూ విజ్ఞానంతో పాటు వినోదం కూడా సమపాళ్లలో ఉన్నప్పుడే విద్యార్థులకు మానసిక వృద్ధి సాకారమవుతుందన్నారు. ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ శేషారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల క్రమశిక్షణ, విద్యాభ్యాసన గురించి చిట్కాలు వివరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ విద్యా పోటీల్లో విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు ప్రదానం చేశారు.

కల్యాణ సింహాసనం, పల్లకీ సమర్పణ



పట్టాభి రామాలయంలో పూజలు చేస్తున్న దాత వాసు దంపతులు

అమలాపురం టౌన్: స్థానిక వంటెద్దువారి వీధిలో పట్టాభి రామాలయానికి శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా పట్టణానికి చెందిన దున్నాల వాసు దంపతులు రూ.75 వేలతో తయారు చేయించిన టేకు కల్యాణ సింహాసనం, పల్లకీని బుధవారం సమర్పించారు. వాసు దంపతుల సమక్షంలో కల్యాణ సింహాసనం, పల్లకీలకు అర్చకులు పూజలు చేశారు. దాతను వంటెద్దువారి వీధి ప్రజలు అభినందించారు. పెద్దలు వంటెద్దు వెంకన్నాయుడు, వంటెద్దు బాబి, మున్సిపల్ మాజీ చైర్మన్ యాళ్ల నాగసతీష్, దూలం శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

యానాం సమస్యలపై దృష్టి సారించండి

యానాం: యానాం నియోజకవర్గ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. బుధవారం పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. విద్యాశాఖలో పారా టీచర్ల వేతనాలు పెంచేలా ఆదేశాలివ్వాలని కోరారు. అంగన్‌వాడీ హెల్పర్లను శాశ్వత ప్రాతిపదికన నియమించాలన్నారు. 2020–21 విద్యా సంవత్సరంలో యానాంలో 53 మంది ఎస్సీ విద్యార్థులకు మంజూరు చేయాల్సిన పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ ఇంకా చెల్లించలేదని అన్నారు. ఆశా వర్కర్ల జీతం రూ.10 వేలకు పెంచుతున్నట్లు సీఎం రంగసామి ప్రకటించారని, వివిధ పాఠశాలల్లో మిల్క్ బాయిలర్స్‌కు సైతం రూ.18 వేల వరకూ పెంచడంపై ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

జీవన నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: యువతీ, యువకులు జీవన నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని ఆర్ఏఓ మునిస్వామి అన్నారు. బుధవారం స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడు రోజులుగా ‘వ్యక్తిత్వ వికాసం’ అనే అంశంపై జాతీయ వర్క్‌షాప్ ఐక్యూఎసీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. డాక్టర్ శాంతకుమార్ మాట్లాడుతూ అత్యున్నత డిగ్రీ పీహెచ్‌డీ చేయడంలో ఎదుర్కొన్న అంశాలను వివరించారు. డాక్టర్ శ్రీలత, డాక్టర్ సుబ్బలక్ష్మి, ప్రిన్సిపల్ వరుగు భాస్కరరెడ్డి, రిసోర్స్‌పర్సన్ వై.దుర్గాప్రసాద్, రూసా కోఆర్డినేటర్ డాక్టర్ జేవీ సుధాకర్, సైకాలజిస్టు సి.కృష్ణ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎండీయూడబ్ల్యూఏ కార్యవర్గ సభ్యులతో దళిత నాయకులు

తాళ్లరేవు: స్థానిక అంబేడ్కర్ భవన్‌లో మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. ఎండీయూడబ్ల్యూఏ రిజిస్టర్ నెంబరు.64–1992 కోఆర్డినేటర్ రెడ్డి గిరిబాబు సమక్షంలో కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. కమిటీ అధ్యక్షునిగా పెయ్యల రమేష్, ఉపాధ్యక్షులుగా కోరుకొండ చంటి, మోకా దుర్గాప్రసాద్, పెయ్యల రాంజీ, ప్రధాన కార్యదర్శిగా తాడి షణ్ముఖరాజు, సహాయ కార్యదర్శులుగా ఊడా సత్యశ్రీనివాస్, వినకోటి గోపి, ట్రెజరర్‌గా దడాల చిన సత్యనారాయణలను ఎంపిక చేసినట్లు గిరిబాబు తెలిపారు. అనంతరం కమిటీ సభ్యులు, దళిత నాయకులు భారీ మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు.

ఇరువర్గాల ఘర్షణ

అల్లవరం: ఓడలరేవు మరిడమ్మ సెంటర్లోని స్థల వివాదం ఇరువర్గాల ఘర్షణకు దారి తీసింది. స్థానికుల కథనం ప్రకారం.. మరిడమ్మ సెంటర్లో చింతా సత్యం, చింతా కృష్ణమూర్తిల ఉమ్మడి ఆస్తి పంపకాల విషయమై కొద్దికాలంగా గొడవ జరుగుతుంది. ఇటీవల ఓఎన్జీసీ భారీ వాహనాలు తరలింపు నిమిత్తం ఈ స్థలంలో ఉన్న షెడ్డుని తొలగించి టాటా కంపెనీకి చెందిన అధికారులు పరిహారం చెల్లించారు. ఈ స్థలంలో వాటా కావాలని కృష్ణమూర్తి నెల రోజులుగా గ్రామంలోని పెద్దల వద్దకు తిరుగుతున్నారు. అయితే ఈ స్థలానికి చెందిన డాక్యుమెంట్లు ఉంటే చూపాలని గ్రామస్తులు కోరారు. ఈ స్థలంపై హక్కు సాధించేందుకు సత్యం, కృష్ణమూర్తి కుమారుల మధ్య బుధవారం మరోమారు ఘర్షణ జరిగింది. సత్యం కుమారుడు శ్రీను, మనవడు సన్నీల్‌కు కృష్ణమూర్తి కుమారులకు మధ్య వివాదం జరిగింది. ఇందులో శ్రీను, సన్నీల్ గాయాలయ్యాయి. కృష్ణమూర్తి కుటుంబీలకు స్వల్పంగా గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు.

అజెండాలో తప్పులు రానీయొద్దు



మున్సిపల్ సమావేశంలో పలు అంశాలపై చర్చిస్తున్న కౌన్సిలర్లు

అధికారులకు కౌన్సిలర్ల సూచన


అమలాపురం టౌన్: కౌన్సిల్ సమావేశాలకు ముందు రూపొందించే అజెండాల్లో తప్పులు ఎక్కువగా ఉంటున్నాయని, ఇక నుంచి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు పాలకపక్ష కౌన్సిలర్లు సూచించారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన కౌన్సిల్ హాలులో బుధవారం జరిగింది. అజెండాలోని పలు అంశాలు స్పష్టంగా ఉండడం లేదని పాలకపక్ష కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులినాని అన్నారు. కమిషనర్, మున్సిపల్ డీఈఈ, మేనేజర్‌లు ఇక నుంచి అజెండా రూపకల్పనలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఫలానా పనిని మంత్రి పినిపే విశ్వరూప్ సూచించినప్పుడు అజెండాలో మంత్రి ఏ ప్రజా ప్రయోజనాలతో సూచించారో స్పష్టంగా పేర్కొనాలని అధికారులకు చెప్పారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, కౌన్సిలర్లు నాగారపు వెంకటేశ్వరరావు, చిత్రపు రామకృష్ణ, గొవ్వాల రాజేష్, చిట్టూరి పెదబాబు, బండారు గోవిందు తదితరులు పలు అంశాలపై చర్చించారు. తొలుత చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి మాట్లాడుతూ అజెండాలో చేర్చే పలు అంశాలు తన దృష్టికి తీసుకురావడం లేదన్నారు. ఇక నుంచి కమిషనర్, ఇతర అధికారులు అజెండాలో చేర్చే ఏ అంశమైనా తన దృష్టికి తీసుకురావాలన్నారు. చైర్‌పర్సన్ తీరుపై కొందరు కౌన్సిలర్లు అసహనం వ్యక్తం చేసి సమావేశాన్ని వాకౌట్ చేశారు. ఈ సమయంలో సమావేశాన్ని కొనసాగించాలని మరికొందరు నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, తర్వాత చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణిలు కౌన్సిలర్ల వద్దకు వెళ్లి చర్చించారు. అనంతరం సమావేశం తిరిగి ప్రారంభమైంది.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

తాళ్లరేవు: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం సీడీపీఓ మాధవి ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ మాతా, శిశు సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. రిటైర్డ్ ప్రొఫెసర్ అనంతలక్ష్మి మాట్లాడుతూ చిరుధాన్యాలలో పోషక విలువలు అధికంగా ఉంటాయన్నారు. అనంతరం గర్భిణులకు ఎంపీపీ తదితరులు సీమంతాలు చేశారు. జెడ్పీటీసీ దొమ్మేటి సామ్యూల్ సాగర్, నాయకులు దున్నా జనార్దనరావు, కుడుపూడి శివన్నారాయణ, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కొలిక్కిరాని శ్మశానవాటిక సమస్య

- మళ్లీ రోడ్డెక్కిన ఎన్.కొత్తపల్లి గ్రామస్తులు
- జేసీ ధ్యానచంద్ర హామీతో ఆందోళన విరమణ



గ్రామస్తులతో చర్చలు జరుపుతున్న జేసీ ధ్యానచంద్ర

ఉప్పలగుప్తం: శ్మశాన వాటికకు సంబంధించిన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని గ్రామస్తులు ఆరోపిస్తున్న సమస్య కొలిక్కి రాలేదు. మండలంలోని ఎన్.కొత్తపల్లి గ్రామంలో శ్మశాన వాటిక భూమి ఆక్రమణకు గురైందని ఈ నెల 23న గ్రామస్తులు ధర్నా చేసిన విషయం తెలిసిందే. ఉప్పలగుప్తం రెవెన్యూ పరిధి వానపల్లిపాలెం గ్రామంలో పాత ఐనాపురం మేజర్ డ్రెయిన్ గట్టును ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 566/5లో కొంత ప్రభుత్వ భూమిని ఎన్.కొత్తపల్లి గ్రామానికి చెందిన కోలా నరసింహమూర్తి ఆక్రమించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ భూమిని గతంలో శ్మశానవాటికగా ఉపయోగించేవారమని, తమకు అప్పగించాలని ధర్నాకు దిగి నిరసన తెలిపారు. 29న ఇరువర్గాలతో మాట్లాడి విషయం పరిష్కరిస్తామని అధికారులు చెప్పారు. గడువు ముగియటంతో గ్రామస్తులు బుధవారం మహిళలతో సహా మళ్లీ ధర్నాకు దిగి ఎన్.కొత్తపల్లి రోడ్డుపై బైఠాయించి ఆర్డీవో రావాలని డిమాండ్ చేశారు. జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, తహసీల్దార్ జె.వెంకటేశ్వరితో కలసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో చర్చలు జరిపి అదే గ్రామంలో కాట్రేనికోన మండలం సరిహద్దులో సర్వే 2/1 నంబర్‌లో ఉన్న 1.42 సెంట్ల స్థలం శ్మశానవాటికకు కేటాయించారని, దానిని ఎందుకు నిరుపయోగంగా వదిలివేశారని ప్రశ్నించారు. ఆ శ్మశానవాటిక విషయంలో కొన్ని తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవటంతో దానిని వినియోగించడం లేదని గ్రామస్తులు సమాధానమిచ్చారు. ఆక్రమణకు గురైందని ఆరోపిస్తున్న భూమిపై రీ సర్వే చేయించి, రైతు వద్ద ఉన్న డాక్యుమెంట్ సరైందో కాదో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని జేసీ అన్నారు. ఒకవేళ అది రైతుకే చెందినట్లయితే ప్రభుత్వంతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానన్నారు. దీంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

